క్లుప్తంగా

విజిబుల్ పోలీసింగ్‌తో భరోసా



వాహనాల రికార్డులు తనిఖీ చేస్తున్న పోలీసులు

కర్నూలు (టౌన్): జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు ఆదివారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించడంలో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు హెల్మెట్, కారు డ్రైవర్లు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రహదారి భద్రత నియమాల ఉల్లంఘనలపై పోలీసులు చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన వరప్రసాద్

పాణ్యం: మండల పరిధిలోని కౌలు రు–భూపనపాడు మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.. స్థానికుల వివరాల మేరకు.. బనగానపల్లె మండలం రామతీర్థం గ్రామానికి చెందిన వెంకట వరప్రసాద్ బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి



శ్రీకృష్ణ దేవరాయల జయంతిలో పాల్గొన్న సంఘం నాయకులు

కర్నూలు(అర్బన్): వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అనేక చెరువులు, కాలువలు తవ్వించి దక్షిణ భారత దేశాన్ని సస్యశ్యామలం చేసిన శ్రీకృష్ణ దేవరాయల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ఫిబ్రవరి 16న అధికారికంగా నిర్వహించాలని నగర తెలగ, కాపు, బలిజ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మన్న, రవికుమార్ కోరారు. ఆదివారం శ్రీ కృష్ణ దేవరాయల 555వ జయంతి సందర్భంగా స్థానిక జీజీ హాస్పిటల్ సర్కిల్‌లో ఉన్న రాయల విగ్రహానికి కార్పొరేటర్లు రమణమ్మ, సాంబశివరావు గజమాల వేశారు. అనంతరం బలిజ సంఘం పెద్దలు ఆర్జా రామకృష్ణ, పత్తి ఓబులయ్య, డాక్టర్ కుళ్లాయప్ప, భాస్కర్‌బాబు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక దేవాలయాలు నిర్మించి సాహితీ సమరాంగణ సార్వభౌములుగా శ్రీకృష్ణ దేవరాయలు పేరుగాంచారన్నారు. సంఘం గౌరవ సలహాదారు సోమశేఖర్ మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ సబ్సిడీ రుణాల యూనిట్ల సంఖ్యను మరింత పెంచాలన్నారు. కాపు భవన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, బలిజలకు నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇటీవల పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన న్యాయవాది శ్రీనివాసులును సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. నాయకులు ఈశ్వర్‌కుమార్, శైలేష్, స్వామిరెడ్డి, రమణ, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు పెరగాలి



అనుగ్రహ భాషణం చేస్తున్న దత్త విజయానంద తీర్థ స్వామి

కర్నూలు కల్చరల్: దేవాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు పెరగాల్సిన అవసరం ఉందని మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి అన్నారు. రాయలసీమ పర్యటనలో భాగంగా ఆదివారం కర్నూలుకు వచ్చిన ఆయన సూర్య నారాయణ స్వామి దేవాలయాన్ని దర్శించారు. ఆలయంలోని దేవీ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీచక్ర పూజ చేశారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. మాఘమాసం ప్రాముఖ్యత, సూర్యనమస్కారాలు, సూర్య అనుష్టానం గురించి భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు దివ్య దత్త రక్షలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ఆలయ ట్రస్ట్ సభ్యులు, మాతృ మండలి సభ్యులు పాల్గొన్నారు.



పాల్గొన్న భక్తులు

కొత్త రేషన్‌కార్డుల మంజూరెప్పుడో?

- అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా కొత్త కార్డుల ఊసేలేదు
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అర్హులు
- పేదలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం

కల్లూరు: కూటమి ప్రభుత్వం రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు షాక్ ఇస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఒక్క కొత్త రేషన్ కార్డు మంజూరు చేసిన దాఖలాలు లేవు. రేషన్ కార్డు ల కోసం ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకుండా దరఖాస్తులు స్వీకరించలేమని సచివాలయ సిబ్బంది చెబుతుండడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. అలాగే రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే కార్డులు

2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ ఉద్యోగులు వలంటీర్ల ద్వారా అర్హులైన వారందరికీ ఇంటి వద్దకే రేషన్ కార్డులు అందించారు. అధికారంలోకి వచ్చేందుకు చాలా హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం గెలిచాక ప్రజల శ్రేయస్సును విస్మరిస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా రేషన్ కార్డుల ఊసే ఎత్తడం లేదు. దీంతో దరఖాస్తుదారులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. రేషన్ కార్డుదారులకు ప్రభుత్వాలు బియ్యం, చక్కర, కంది బ్యాలు తదితర నిత్యావసర సరుకులు సరఫరా చేస్తుంటాయి. వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం దరఖాస్తుదారులకు విరివిగా రేషన్ కార్డులు అందజేసింది. గ్రామ/వార్డు సచివాలయాలను వేదికగా చేసుకుని గంటల వ్యవధిలోనే రేషన్ కార్డులు ఇచ్చి చరిత్ర సృష్టించింది. అది కూడా వలంటీర్లు అర్హుల ఇంటి వద్దకే వెళ్లి దరఖాస్తులు స్వీకరించారు. కార్డు మంజూరు అయ్యాక ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులకు రేషన్ కార్డులు అందాయి. పారదర్శకతకు పెద్దపీట వేశారు.



మళ్లీ 2014 మాదిరి గానే ఇస్తారా!

2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం అరకొరగా రేషన్ కార్డులను మంజూరు చేసింది. అప్పట్లో జన్మభూమి కమిటీల పెత్తనంతో కార్డులు మంజూరయ్యేవి. దీంతో చాలా మంది అర్హులకు కార్డులు దక్కలేదు. ఈ కారణంగా కార్డులు రాని వారు నిరాశకు గురయ్యేవారు. చాలా మంది ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. కనీసం నిత్యావసర సరుకులు అందక ఇబ్బందులు పడ్డారు. మళ్లీ కార్డుల మంజూరులో కూటమి నేతలు జోక్యం చేసుకుంటే రేషన్ కార్డుల మంజూరులో కోతలు పడే అవకాశాలున్నాయని ప్రజలు పెదవి విరుస్తున్నారు.



రేషన్ కార్డులు మంజూరు చేయాలి

మండలంలో అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి. అలాగే రేషన్ కార్డులో కొత్త సభ్యులను చేర్పించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలి. ప్రభుత్వ సేవలు, పథకాలు మొదలగు వాటన్నింటికి రేషన్ కార్డుల అవసరం ఉంది. ప్రభుత్వం అందిస్తున్న సేవలు, పథకాలు దక్కాలంటే తప్పనిసరిగా అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలి. **–మధు, సీఐటీయూ మండల కార్యదర్శి**

నేడు ఫిజియోథెరపి క్యాంప్

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో సోమవారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ జ్యోతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు ప్రతి సోమవారం ఫిజియోథెరపిస్టు వీరేష్ ఫిజియోథెరపీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ సభ్యుల్లోని దివ్యాంగులను భవిత కేంద్రానికి తీసుకొచ్చి ఫిజియోథెరపి చేయించుకోవాలని సూచించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లైంగిక వేధింపుల కేసు నమోదు

నందికొట్కూరు: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు తెలిపారు. ఆదివారం మండలం పరిధిలోని వడ్డేమాన్ గ్రామానికి చెందిన షరీఫాబేగంపై లైంగిక వేధింపులకు పాల్పడిన గొల్ల రామకృష్ణ, వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేశామన్నారు. ప్రైవేట్ వీడియోలు తీసి అందరికీ పంపిస్తామని, తమ కోరిక తీరిస్తే డిలీట్ చేస్తామని బెదరించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది అన్నారు. విచారణ చేపట్టి ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్ష, ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీకి చెందిన కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి కుమారుడు రాజేష్‌రెడ్డి వివాహం ఆదివారం కోడుమూరులో ఘనంగా జరిగింది. వివాహ వేడుకకు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరితో పాటు కోడుమూరు, గూడూరు ఎంపీపీలు గాడి రూతమ్మ, సునీత, గూడూరు మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ అస్లామ్, ఆయా మండలాల జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగం.. సరిచేస్తే ఎంతో ఉపయోగం



దిగువపాడు శివాలయం వద్ద పనిచేయని చేతిపంపు



దర్గా సమీపంలో మరమ్మతులకు గురైన చేతిపంపు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని దిగువపాడు శివాలయం, దర్గా ప్రాంతాల్లో రెండు చేతిపంపులు(బోరింగ్) మరమ్మతులకు గురయ్యాయి. కొన్నేళ్లుగా పనిచేయకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో ఈ చేతిపంపుల నీరే గ్రామస్తులకు ఆధారంగా ఉండేవి. పంచాయతీ కొళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా విద్యుత్ లేని సమయాల్లో, అత్యవసర పరిస్థితిల్లో చేతిపంపులు ఎంతో ఉపయోగపడేవని స్థానికులు చెబుతున్నారు. రానున్న వేసవి కాలన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు మరమ్మతులకు గురైన చేతిపంపులను రిపేరు చేయించాలని కోరుతున్నారు.

గడ్డివామి దగ్ధం

సి.బెళగల్: మండల పరిధిలోని ఇనంగడ్ల గ్రామంలో ఆదివారం గడ్డివామి దగ్ధమైంది. వివరాలు.. గ్రామానికి చెందిన దేవరాజు సుమారు రూ.లక్ష విలువ చేసే పశుగ్రాసాన్ని కల్లం దొడ్డిలో నిల్వ చేసుకున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్టుండి గడ్డివామి నుంచి మంటలు చెలరేగాయి. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో కొద్ది సమయంలోనే మొత్తం పశుగ్రాసం కాలి బూడిదైంది. స్థానికులు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకుండాపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.



ఇనగండ్లలో కాలిపోయిన గడ్డివామి



తిరునాలలో గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు

తిరునాల సందడి

కోడుమూరు రూరల్: కోడుమూరులో చౌడేశ్వరీదేవి తిరునాల ఆదివారం వసంతోత్సవం కార్యక్రమంతో ఘనంగా ముగిసింది. వారం రోజుల పాటు జరిగిన తిరునాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా స్థానిక తేరుబజార్‌లో గాజుల దుకాణాలు, మిఠాయి, పిల్లల ఆట వస్తువుల దుకాణాలు కొనుగోలుదారుల రద్దీతో సందడిగా మారాయి. ముఖ్యంగా రంగురంగుల గాజుల కొనుగోలుకు మహిళలు అమితాసక్తి చూపడంతో గాజుల దుకాణాలు కిటకిటలాడాయి.



పిల్లల ఆట వస్తువులను కొనుగోలు చేస్తూ..


మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

కర్నూలు (టౌన్): నగరంలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని 2వ వార్డులో రూ.35 లక్షలతో మురుగు కాల్వలు, 50వ వార్డు కోత్తపేటలో రూ.20 లక్షలతో ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి పనులు, 12వ వార్డు డబరా కాలనీలో రూ.62.4 లక్షలతో మురుగు కాల్వలు, 24వ వార్డులో రూ.75 లక్షలతో మురుగు కాల్వలు, 23వ వార్డు శ్రీరామనగర్‌లో రూ.50 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన పనులు చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ మాట్లాడుతూ.. నగరంలో సమస్యలు గుర్తించి మూడు నెలల వ్యవధిలో పూర్తి చేస్తామన్నారు. కమిషనర్ రవీంద్ర బాబు మాట్లాడుతూ.. నగరంలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం మంత్రి అధికారులతో కలిసి పలు కాలనీల్లో పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

నేడు శంకుస్థాపనలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని అశోక్‌నగర్ నీటిశుద్ధి కేంద్రంలో రూ.4.62 కోట్లతో సూపర్‌వైజర్ కంట్రోల్ అండ్ డేటా ఆక్విజేషన్ నిర్వహణ కేంద్రం పనులకు సోమవారం ఉదయం 11 గంటలకు మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన చేస్తారని కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 3 శుభ్రం చేసే యంత్ర వాహనాలను ప్రారంభిస్తారని, అలాగే రూ.22 కోట్లతో జగన్నాథగట్టు మీద ఐ.ఐ.టీ.డీ.ఎం కళాశాలకు తాగునీటి సరఫరాకు సంబంధించి వీకర్ సెక్షన్ కాలనీలోని పుచ్చలపల్లి సుందరయ్య పార్కులో శంకుస్థాపన పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

వారంతపు సంతతో ఇక్కట్లు



సంతలో సంచరిస్తున్న బర్రెలు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలో నిర్వహిస్తున్న వారాంతపు సంతలో వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. ప్రతి ఆదివారం మధ్యాహ్నం నుంచి వారంతపు సంత ప్రారంభమవుతుంది. అయితే ఇరుకైన రోడ్లపై విక్రయాలు జరుగుతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇదే రోడ్డు మీదుగా బర్రెలను పొలాలకు తోలుకెళ్లాల్సి రావడంతో ఇటు వ్యాపారులు, అటు కొనుగోలుదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

వివాహ వేడుకలో కాటసాని



వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: పట్టణంలోని జీఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో శని, ఆదివారాల్లో జరిగిన హనుమంతరాయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఏఓ సురేష్‌కుమార్ తనయుడు సాహిత్ వివాహ వేడుకలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని నక్కలదిన్నె మెట్ట వద్ద ఆదివారం కారు, బైకు ఢీకొన్న ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. చాగలమర్రికి చెందిన కుళాయప్ప, వేంపల్లెకు చెందిన గోవర్ధన్ అనే ఇద్దరు బైక్‌పై ఆళ్లగడ్డ వైపు నుంచి చందలూరుకు వెళ్తున్నారు. చందలూరు నుంచి కొందరు కారులో ఆళ్లగడ్డ వైపు వెళ్తున్నారు. నక్కలదిన్నె మెట్ట వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. బైక్‌పై వెళ్తున్న ఇరువురు కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు వారు తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



రంగాపురం గ్రామంలో కూల్చివేస్తున్న నిర్మాణాలు

బేతంచెర్ల: ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె నుంచి డోన్ వరకు రూ.650 కోట్లతో 340 (బీ) జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. బేతంచెర్ల మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉన్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో ఆదివారం కూల్చి వేశారు. గూటుపల్లె రహదారిలో ఉన్న పెద్దరాజు స్వామి దర్గా ముఖ ద్వారంను కూల్చి వేయడంతో పాటు వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించి పశు వైద్యశాల ఆవరణలో ఉంచారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కోడుమూరు బాలుర హైస్కూల్ 2005-06 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

కోడుమూరు రూరల్: అక్కడ ఆనందాలు వెల్లివిరిసాయి. వారంతా చిన్ననాడు తాము చదువుకున్న పాఠశాలలో ఎన్నో జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 20ఏళ్ల కిందట పాఠశాలలో టీచర్లు చెప్పిన పాఠాలు, స్నేహితులతో కలిసి ఆడి పాడిన ఆటపాటలను, అల్లరి పనులను గుర్తు చేసుకుంటూ ఆనాటి మధురజ్ఞాపకాల్లో మునిగితేలారు. కోడుమూరులోని బాలుర హైస్కూల్‌లో 2005–06 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు పరమేశ్వరరెడ్డి, తిమ్మారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, శ్రీను, నాగరత్నం శెట్టి, లోకేశ్వరి, గోకారి, వెంకట రాజారెడ్డి, నరసింహారావు, రామచంద్రారెడ్డి, విజయ్‌కుమార్, రామచంద్రుడు, నిస్సార్ ఆహమ్మద్, కృష్ణ మోహన్, ప్రస్తుత హెచ్‌ఎం తైమూర్ బాషాలను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వారి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఖాదర్‌బాషా, ముని, శివ, లక్ష్మయ్య, రాంప్రసాద్, పరమేష్, రాజు, ఉరుకుందు, వీరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ నీరు తాగేదెట్లా..!

గడివేముల: మండల కేంద్రం గడివేముల కొర్రపాలూరు రస్తాలోని పలు కొళాయిల్లో కలుషిత నీరు రావడంతో కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. మంచినీటి పైపులైన్‌లో మురగునీరుతో పాటు వ్యర్థాలు వస్తున్నాయని కాలనీవాసులు తెలిపారు. ఈ నీరు తాగితే వ్యాధులు రావడం ఖాయమని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీలను గుర్తించి సురక్షితమైన నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కొళాయిలో వచ్చిన కలుషిత నీరు

ఆహా ఏమి రుచి!



ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభ కార్యక్రమంలో అతిథులు, మానవత సభ్యులు

కర్నూలు కల్చరల్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చారిటీ మహిళా ఫుడ్ ఫెస్టివల్ ఉత్సాహంగా సాగింది. ఏక్యాంప్‌లోని కుడా కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌ను ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మహబుబ్ బాషా, డీఎఫ్ఓ శివశంకర్‌రెడ్డి, కుడా ఈఈ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానవత సంస్థ మహిళా విభాగం సామాజిక సేవలు అభినందనీయన్నారు. మహిళా విభాగం కన్వీనర్ యాని ప్రతాప్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్, మహిళా ఎంటర్ ప్రెన్యుయర్స్‌ను ప్రోత్సహించడంలో భాగంగా ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఫుడ్ ఫెస్టివల్‌లో వచ్చిన మొత్తాన్ని క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహణకు వినియోగిస్తామన్నారు. మహిళలు స్వచ్ఛందంగా తమ ఇళ్లలో వివిధ రకాల వంటకాలను తాయరు చేసుకొని వచ్చి ఫుడ్ ఫెస్టివల్ విక్రయించారు. రాగి ముద్ద, మటన్ బిర్యానీ, మిల్లెట్ ఫుడ్, పేనీలు, షిప్ ఫ్రై, మటన్ కట్‌లెట్, అవిసె, నువ్వుల లడ్డూలూ, చాట్ ఐటమ్స్, మిల్క్ నన్నారి తదితర ఐటమ్స్‌తో ఫెస్టివల్ సందడి కనిపించింది. అధ్యక్షురాలు దీప, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





ఫుడ్ ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్